సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మొరాయించిన ఓపెన్ జిమ్ పరికరం



పని చేయని పరికరం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఓ పరికరం వారం నుంచి పని చేయడం లేదు. గతేడాది జీవీఎంసీ అధికారులు ఇక్కడ వాకింగ్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.దీంతో వాకర్స్‌తో పాటు మహిళలు రోజూ వాకింగ్ చేసి,వ్యాయామం చేసుకునే వారు. అయితే పొట్టభాగంలో కొవ్వు తగ్గించే పరికరానికి ఉన్న నట్లు పోవడంతో ఆ పరికరం మొరాయించింది.అధికారులు స్పందించి పరికరాన్ని వినియోగంలోకి తేవాలని వాకర్స్ కోరుతున్నారు.

సేవలకు గుర్తింపు



సేవారత్న అవార్డు అందుకున్న విజయకుమార్

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ సచివాలయం (1086348)లో క్లస్టర్–13 వలంటీర్ విజయ్‌కుమార్ సేవలకు గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం సేవారత్న అవార్డు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సచివాలయ అడ్మిన్, కార్యదర్శులు విజయ్‌కుమార్‌కు బ్యాడ్జి, ధృవీకరణ పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. క్లస్టర్‌లో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడంతో విజయకుమార్ పనితీరు అమోఘమని అభినందించారు. వచ్చే ఏడాది సేవా వజ్ర అందుకోవాలని ఆకాంక్షించారు.

పర్యావరణ హితంగా వర్సిటీ ప్రాంగణం



మొక్క నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని పర్యావరణహితంగా మలచాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. సోమవారం ఉదయం ఏయూ హార్టికల్చర్ విభాగంలో ఔషధ, అలంకరణ, నీడనిచ్చే మొక్కల పెంపకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వర్సిటీ అధికారులతో కలసి మొక్కలు నాటారు. వర్షాకాలం ప్రారంభం అయ్యే సమయానికి వర్సిటీలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. పక్షులకు ఆశ్రయం ఇస్తూ, ఆహ్లాదాన్ని పంచే మొక్కలను పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భవనాలకు సమీపంలో కాకుండా దూరంగా మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం వర్సిటీ స్వయంగా అభివృద్ధి చేస్తున్న నర్సరీలోని పలు మొక్కలు, వాటి ప్రత్యేకతను వీసీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, బ్యూటిఫికేషన్ విభాగం గౌరవ సంచాలకులు డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జె.ప్రకాశరావు, శ్రీధర్ బాబు, డాక్టర్ టి.షారోన్‌రాజు, ఎన్.ఎ.డి.పాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606

మురుగుతో ఇక్కట్లు!



భగత్‌సింగ్ నగర్ కాలువలో నిలిచిన మురుగు



భగత్‌సింగ్ నగర్‌లోని మరో వీధిలో కాల్వల దుస్థితి

- 89వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఇదే సమస్య
- వర్షం కురిస్తే మరింత దారుణం

గోపాలపట్నం: ఆ వార్డు అభివృద్ధి చెందుతున్న ప్రాంతం... అపార్ట్‌మెంట్‌లతో పాటు గృహాలు కూడా ఎక్కువగా నిర్మాణం అవుతున్నాయి. అయితే మౌలిక వసతులు ఆ స్థాయిలో లేవు. పలు ప్రాంతాల్లో రహదారులు వేసినా సరైన కాల్వలు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ జీవీఎంసీ 89వ వార్డులోని పరిస్థితి. కొత్తపాలెం, చంద్రనగర్, యల్లపువానిపాలెం ప్రాంతాల్లో కొంత మేర కాల్వలు ఉన్నా..., ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ఖార్వేల్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, సంతోష్‌నగర్, డీఏఆర్‌నగర్ ప్రాంతాల్లో మురుగు నీటి సమస్య చాలా తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో వాడుక నీరు వెళ్లేందుకు కాల్వలు లేకపోవడమే ప్రధాన కారణం. ఆయా ప్రాంతాల్లో గ్రూప్‌హౌస్‌లు అపార్ట్‌మెంట్‌లు ఎక్కువగా ఉండడంతో సమస్య మరింత దారుణంగా ఉందని ఇక్కడి వారు వాపోతున్నారు. భగత్‌సింగ్‌నగర్‌లో ఏ వీధిలో కూడా సరైన మురుగు కాల్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మురుగు నీరుతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కాల్వలు సరైన రోడ్లు లేకుండా నూతన నిర్మాణలకు అనుమతులు ఎలా ఇస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వర్షాకాలంలో నరకమే... : వర్షా కాలం వస్తే చాలు వర్షం నీరు.. మురుగు నీరు కలసి చాలా దారుణంగా తయారవుతుంది. ఆడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఖార్వేల్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతాలు చెరువులను తలపిస్తాయి. మురుగు నీరు వెళ్లే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేడి తారులో జారిపడి డ్రైవర్ మృతి

- మృతుడిది విశాఖపట్నం

రాయగడ: వేడి తారులో ప్రమాదావశాతు కాలుజారి పడిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. మృతుడు విశాఖపట్నానికి చెందిన ఎ.కృష్ణారావు(42)గా గుర్తించారు. జిల్లాలోని బిసంకటక్ సమితి దుర్గి పంచాయతీ పరిధి బొంధుగుడ గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొంధుగుడ గ్రామంలో రహదారి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విశాఖపట్నం నుంచి వచ్చిన లారీలోని తారును హాట్‌మిక్సర్ ప్లాంట్‌లో వేసేందుకు డ్రైవర్ కృష్ణారావు వాహనం పైకి ఎక్కాడు. వాల్‌ను తిప్పుతున్న సమయంలో కాలు జారడంతో హాట్ మిక్సర్‌ప్లాంట్(తారును వేడి చేసే యంత్రం)లో ప్రమాదావశాతు పడిపోయాడు. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల వారు రక్షించేందుకు ప్రయత్నించినా.. ప్రయోజనం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించగా, బిసంకటక్‌కు చెందిన సిబ్బంది దాదాపు 2గంటలు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

దేవస్థానం బంకుల్లో చిల్లర సమస్య

సింహాచలం: వినియోగదారులు ఇచ్చే రెండు వేల రూపాయల నోట్లతో సింహాచలం దేవస్థానం పెట్రోల్ బంకుల్లో చిల్లర సమస్య తలెత్తుతోంది. వినియోగదారులు దేవస్థానం బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొట్టించుకున్న అనంతరం ఇస్తుండటంతో రూ.2 వేల నోటు ఇవ్వడంతో చిల్లర సమస్య తలెత్తుతోందని దేవస్థానం పెట్రోల్ బంకుల పర్యవేక్షణ అధికారి పద్మనాభరాజు సోమవారం తెలిపారు. ఇక మీదట రూ.1500కు పైగా పెట్రోల్, డీజిల్ కొట్టించుకున్న వారి నుంచే రెండు వేల నోటు తీసుకుంటామని తెలిపారు. చిల్లర సమస్య తలెత్తుడుండడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

మహిళా రెజ్లర్ల పోరాటానికి 'అరుణోదయ' సంఘీభావం

ఏయూ క్యాంపస్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని అరుణోదయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి తమ సంఘీభావం ప్రకటించింది. సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ ప్లాటినం గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు సి.నాగరాజు అధ్యక్షత వహించారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పలు కీలక తీర్మానాలు ప్రవేశపెట్టారు. మద్యం తయారీని, అమ్మకాలను రద్దు చేయాలని, ప్రజాస్వామికవాదులు, జర్నలిస్టులపై ప్రభుత్వాలు పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని తీర్మానించారు.

చిరు వ్యాపారుల నిరసన



జోన్–5 కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వ్యాపారులు, నాయకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయం వద్ద తోపుడు బండ్ల చిల్లర వ్యాపారులు, ఏఐటీయూసీ, హాకర్స్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. హాకర్స్ సంఘ గౌరవ అధ్యక్షుడు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ జోన్ పరిధిలో వ్యాపారాలకు సరైన హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. తోపుడు బళ్లు, చిరు వ్యాపారుల దుకాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారని, వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీస్‌లు కేసులు పెట్టి రూ.500 నుంచి రూ.2 వేల వరకు జరిమానాలు వేస్తున్నారన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు, వ్యాపారులు కోరారు.

టీటీడీ ఈ-బుకింగ్ సేవలకు ఎదురుచూపులు

- కోవిడ్ కారణంగా మూతపడిన ఎంవీపీ ఈ–దర్శన కౌంటర్
- రెండున్నరేళ్లుగా తెరుచుకోని వైనం



టీటీడీ దర్శన టికెట్ల కోసం ఎంవీపీ కాలనీలోని సెంటర్ ఎదుట బారులు తీరిన భక్తులు (ఫైల్)

ఎంవీపీ కాలనీ: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు అవస్థలు తప్పడం లేదు. కోవిడ్ కారణంగా మూతపడిన ఎంవీపీ కాలనీలోని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సెంటర్ పునః ప్రారంభం కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ కేంద్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఎంవీపీ కేంద్రంగా దశాబ్దాల క్రితం అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ సేవలు కోవిడ్ కారణంగా నిలిచిపోయాయి. కోవిడ్ అనంతరం ఆన్‌లైన్ టికెట్ విక్రయాలను టీటీడీ ప్రారంభించినప్పటికీ ఈ సెంటర్ సేవలను పునరుద్ధరించలేదు. భక్తులకు గతంలో విలువైన సేవలు అందించిన ఈ సెంటర్ కార్యకలాపాల పునఃప్రారంభం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

గతంలో సేవలు ఇలా..

వెంకన్న దర్శనానికి సంబంధించి టికెట్ విక్రయాలు నెల రోజుల ముందుగానే ఇక్కడ జరిగేవి. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా వారు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నెల రోజులు ముందుగానే ఆయా తేదీల్లో దర్శన టికెట్లను విక్రయించేవారు. దీంతో పాటు తిరుమల కొండపైన, కొండ దిగువన భక్తుల ఆసక్తికి అనుగుణంగా గదులు సైతం బుక్ చేసేవారు. రూ.300, రూ.600 టికెట్ల విక్రయాలు నిత్యం ఇక్కడ జరిగేవి. దీంతో పాటు ఆర్జిత సేవలైన శ్రీవారి కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ, విశేష పూజ టికెట్లు కూడా విక్రయించేవారు. భక్తులు కేవలం ఆధార్ కార్డు జిరాక్స్‌లు, డబ్బులు చెల్లించి ఆయా సేవలు పొందేవారు. ఇప్పుడు ఈ సేవలన్నీ నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో ప్రైవేట్ నెట్ సెంటర్లను ఆశ్రయించి దర్శన టికెట్లను బుక్ చేసుకుంటుండడంతో భక్తులపై ఆర్థిక భారం పడుతోంది.

రెండున్నరేళ్లుగా ఇబ్బందులు

కోవిడ్ కారణంగా రెండున్నరేళ్ల క్రితం నిలిపివేసిన ఎంవీపీ ఈ–దర్శన టికెట్ కౌంటర్‌ను పునరుద్ధరించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. దర్శన టికెట్ల కోసం పెద్ద ఎత్తున ప్రైవేట్ బుకింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయినా టికెట్లు లభించడం లేదు. సమయానికి టికెట్లు దొరకకపోవడంతో పాటు అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో విడుదల చేసిన గంటల వ్యవధిలోనే దర్శన టికెట్లు అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ ఉన్నత ఆశయంతో అందుబాటులోకి తెచ్చిన ఎంవీపీ కాలనీ ఆన్‌లైన్ సెంటర్ సేవలను పునరుద్ధరించాలని కోరుతున్నాం.

– పి.గురుమూర్తి, ఎంవీపీ కాలనీ

ఈ–దర్శన టికెట్ కౌంటర్ పునరుద్ధరించాలి

భక్తులకు ఈ–దర్శన టికెట్ కౌంటర్ సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. దర్శన టికెట్లు ముందుగానే పొందడం ద్వారా రైల్వే, బస్సుల ద్వారా వెళ్లే వారు ప్రయాణ టికెట్లను అనుకున్న తేదీల్లో సులభంగా పొందేవారు. ఆన్‌లైన్ టికెట్లు బుకింగ్‌పై అవగాహన లేని భక్తులకు సైతం ఇక్కడి సిబ్బంది విశిష్ట సేవలు అందించేవారు. దీంతో ఈ సెంటర్‌కు విశేష ఆదరణ లభించింది. ఇప్పటికైనా ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని టీటీడీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– సత్యకుమార్, ఎంవీపీ కాలనీ

కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

కూర్మన్నపాలెం: దేశంలో ఉన్న పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వ రంగ సంస్థలుగా నడిపేలా కార్మికులు తమ పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 830వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు కూర్చుని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు తాకట్టు పెడుతూ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల్ని మోసం చేయడం సరికాదన్నారు. కార్మికుల బలిదానాలతో సిద్ధించిన పరిశ్రమలను కాపాడుకుంటే, దేశానికి మేలు చేసినట్లేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులకు అవార్డులు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా సోమవారం సమ్మర్ స్పీడ్ అండ్ రోల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్, క్రైం సీఐ దుర్గాప్రసాద్, ఎయిర్‌పోర్టు సీఐ బి.ఎం.డి.ప్రసాద్, కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి, స్పోర్ట్స్ అథారిటీ నుంచి ఎస్‌డీవో సూర్యారావు చిన్నారులకు అవార్డులు అందించారు. పార్కు ఉపాధ్యక్షుడు ఎం.శాంతి భూషణరావు, కార్యదర్శి పొట్లూరి నాగరాజు, ట్రెజరర్ కె.కె.సురేష్, కోచ్ సంతోష్, లలితప్రియ, 200లకు పైగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెంటమాంబ.. చల్లగ చూడమ్మా



దర్శనానికి బారులు తీరిన భక్తులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ తల్లి మారు వారం పండగను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు పసుపు,కుంకమలతో అర్చన చేసి సుగంధమాలలు,ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావుయాదవ్, నాయకులు రామ్మోహన్‌నాయుడు,జి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకునేందుకు హిమాచల్‌నగర్ ప్రాంతానికి చెందిన భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

చికెన్ కొట్టు నిర్వాహకుడిపై ఫిర్యాదు



జెడ్సీకి ఫిర్యాదు చేస్తున్న అర్చకుడు



జీవీఎంసీ వాణిజ్య సముదాయం గోడకు వ్యాపారి పెట్టిన కన్నం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో సాయిబాబా ఆలయానికి సమీపంలో ఓ వ్యక్తి చికెన్ కొట్టు నడుపుతున్నాడు. మందిరానికి దగ్గరలో ఇలాంటి వ్యాపారాలు సాగించరాదని గతంలో భక్తులు విన్నవించినా ఆ వ్యాపారి పట్టించుకోలేదు. ఇప్పుడు ఆ వ్యాపారి తన వాణిజ్య సముదాయం అంతర్భాగంలో గోడను కొట్టి కిటికీ ఏర్పాటు చేసుకున్నాడు. ఇది సాయిబాబా ఆలయ ముఖ ద్వారం కుడి భాగానికి దగ్గరలో ఉంది. చికెన్ సెంటర్‌లో ఉన్న వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన ఆ కిటికీ గుండా నేరుగా ఆలయంలోకి వస్తోంది. దీంతో ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, ఆలయ అర్చకుడు చికెన్ కొట్టు నిర్వాహకుడికి సమస్యను వివరించినా ఆయన పట్టించుకోలేదు. దీంతో ఆలయ చైర్మన్, అర్చకుడు, భక్తులు కలిసి సోమవారం జోన్–5 జెడ్సీ ఆర్.జి.వి.కృష్ణకు వినతి ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జెడ్సీ వెంటనే ఆర్ఐ శ్రీనివాస్‌ను ఆ ప్రాంతానికి పంపించి చికెన్ వ్యాపారిపై చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

జోన్-5 'స్పందన'కు ఐదు వినతులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరత్‌కుమార్, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, టీపీఆర్‌వో ఏపీడీ యూసీడీ కె.శైలజ, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

జీవ సమతుల్యత బాధ్యత అందరిది



మట్టి పాత్రలు, పక్షి గూళ్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ప్రతి జీవిని కాపాడే బాధ్యత మానవులపై ఉందని సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ పి.ఉష పిలుపునిచ్చారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వైజాగ్ ఎన్‌జీవోస్ ఫోరంతో కలసి జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిచ్చుకల గూళ్లు, పక్షులకు నీరు పెట్టే పాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ అనేక జాతుల జీవులు అంతరించిపోతున్నాయని వాటిని సంరక్షించాల్సిందేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మే 22న అనేక దేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, మనం కూడా అందులో భాగస్వాములు కావాలని విద్యార్థుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. బయోడైవర్సిటీ బోర్డ్ రీజనల్ కోఆర్డినేటర్ జానకీరామ్ మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణ మన బాధ్యత అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంతరిస్తున్న జీవజాతులను, ప్రస్తుతం ఉన్న జీవజాతులను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. వైజాగ్ ఎన్‌జీవోస్ ఫోరం కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్ మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ప్రతినిధి జె.వి.రత్నం, సిఫా సంస్థ ప్రతినిధి భాస్కర్‌రావు, సోషల్ వర్కర్ రాము, స్వచ్ఛ ప్రియ సంస్థ ప్రతినిధి అనురాధ, సోషల్ వర్క్, ఆంత్రోపాలజీ, హిస్టరీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌తో నావికాదళాధికారి భేటీ



రిజిస్ట్రార్‌కు మొక్కను బహూకరిస్తున్న ఎ.పి.సింగ్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం వెస్టర్న్ నేవల్ కమాండ్ సీనియర్ అధికారి కమాండర్ ఎ.పి.సింగ్ సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకునే అంశాలపై చర్చించారు. డిఫెన్స్ ట్రెనింగ్ సెంటర్ నుంచి క్రెడిట్ బదిలీ ఆధారంగా నావికులకు బీఏ(హెచ్‌ఆర్‌ఎం) డిగ్రీలు అందించడం, పీజీ హెచ్‌ఆర్‌ఎం డిగ్రీలను అందించే దిశగా చర్చించారు. మాజీ సైనికోద్యోగులకు పునరావాస కల్పనకు ఈ డిగ్రీలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. అదే విధంగా లాటరెల్ ఎంట్రీ విధానంలో బీటెక్ కోర్సులు చేసేలా సాధ్యాసాధ్యాలను చర్చించారు. ఏయూతో భారత నావికాదళం అనుబంధం ఎంతో విశిష్టమైనదన్నారు. సైనికోద్యోగుల ఉన్నత విద్య లక్ష్యాలను నెరవేర్చడంలో ఏయూ అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. ఉజ్వల్ కుమార్ ఘటక్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com